సాక్షి కుమురం భీం

ఆదివారం । 14 । జనవరి । 2024



వనక్షేత్రంలో అమ్మవారు

ఎత్తైన గుట్టలు.. చుట్టూ అడవి.. మధ్యలో ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి వన క్షేత్రం ఉంది. ఇక్కడ నేటి నుంచి నెలపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. 8లో▸



ఇష్ట దేవతలకు ప్రత్యేకపూజలు

కొలాం ఆదివాసీలు మూడురోజులపాటు ఇష్ట దేవతలకు మొక్కులు చెల్లించనున్నారు. కెరమెరి మండలం పాట్నాపూర్ గ్రామంలో కొలువైన దేవతల వద్దకు భక్తులు అధికసంఖ్యలో రానున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/17.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కొండగట్టులో 'పాల్వాయి' పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న హరీశ్‌బాబు

కౌటాల: జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం దేవస్థాన కమిటీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబును సన్మానించారు. ఆయన వెంట మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తదితరులున్నారు.

వైన్స్‌లకు జరిమానా



జరిమానా విధిస్తున్న పంచాయతీ సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని బాలజీ, శ్రీ వైష్ణవి వైన్స్‌లకు కౌటాల గ్రామపంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ శనివారం జరిమానా విధించారు. వైన్స్‌ల సమీపంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం పడేయడంతో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది ఒక్కో వైన్స్‌కు రూ.500 చొప్పున జరిమానా విధించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇళ్ల మధ్య వైన్స్‌లు ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మందుబాబులు గృహాల ఎదుటే మూత్ర విసర్జన చేస్తున్నారని కాలనీవాసులు వాపోయారు. అధికారులు స్పందించి వైన్స్‌లను ఇళ్లకు దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ లయన్ మెల్విన్ జోన్స్ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంజెఎఫ్ సభ్యులుగా చేరిన లయన్ ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి, నాంపల్లి శంకర్ ను సన్మానించారు. కార్యక్రమంలో నర్సయ్య, శంకర్, సంజయ్‌కుమార్, వేణుగోపాల్, వెంకన్న, వినాయక్‌రావ్ ఉన్నారు.



మహిళలతో రద్దీగా జిల్లా కేంద్రంలోని ఓ దుకాణం

సందడే సందడి

- పల్లె లోగిళ్లలో సంక్రాంతి సంబురం
- నేటి నుంచి పండుగ సందడి మరూ
- ఇంటింటా పిండివంటల తయారీ
- ముంగిళ్లకు రంగవల్లుల శోభ
- సొంత గ్రామాలకు చేరుకున్న ప్రజలు

కుటుంబ సభ్యులతో సొంతూరికి వచ్చాం



కుటుంబ సభ్యులతో మార సందీప్

ఆసిఫాబాద్: నేను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపనీలో పని చేస్తా. సంక్రాంతి పండుగ కోసం ఆసిఫాబాద్‌కు కుటుంబంతోని వచ్చాను. పండుగ వేళ ఇంట్లో సందడి నెలకొంది. పిండి వంటల తయారీలో మా కుటుంబ సభ్యులు బిజీగా ఉన్నారు. పండుగను సొంతూళ్లో జరుపుకొంటే చెప్పలేని ఆనందంగా ఉంటుంది. – మార సందీప్, నిజామాబాద్



వివేకానంద చౌక్‌వద్ద వెలిసిన రంగుల దుకాణాలు

ఆసిఫాబాద్‌అర్బన్: రంగవల్లులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, నోరూరించే పండి వంటల ఘుమఘుమలు, హరిదాసు పాటలు, బసవన్న ఆటలతో పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగ సెలవులు రావడంతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా జిల్లాలోని స్వగ్రామాలకు చేరుకున్నారు. మూడురోజులు పండుగ జరుపుకొనేందుకు అంతా సిద్ధమయ్యారు. ఆదివారం బోగి, సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ జరుపుకోనున్నారు. సంక్రాంతి అనగానే చకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు ఇతర పిండి వంటలు ఇళ్లల్లో చేస్తారు. ఉమ్మడి కుటుంబాల్లోనైతే పూర్వం 10 రోజుల ముందునుంచే పండి వంటల తయారీ సందడి కనిపించింది. ఇప్పుడు ఏ ఇంటి తలుపుతట్టినా పండి వంటల తయారీతో సందడిగా కనిపిస్తోంది. నెలల తరబడి నిల్వ ఉండే స్థాయిలో సిద్ధం చేసుకుంటున్నారు. చిన్నారులు పతంగులతో సందడి చేస్తున్నారు.

ఎటు చూసినా పండుగ శోభే

భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఇళ్ల ముంగిట ముత్యాల ముగ్గుల సొబగులను చూడాల్సిందే. ముగ్గుల మధ్య ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు పెడతారు. వాటి చుట్టూ రేగు పళ్లు, నవధాన్యాలు, గరిక పోసలు, పూలు ఉంచి అందంగా అలంకరిస్తారు. మార్కెట్‌లో కొద్దిరోజుల క్రితమే రంగుల దుకాణాలు వెలిశాయి. ముత్తైదువలు నోములు నోచుకుంటారు. కొత్తగా పెళ్లయినవారు నోము నోచుకోవడం సంప్రదాయంగా భావిస్తారు. దుకాణాల్లో చిన్నారుల కోసం ఆకర్షణీయమైన పతంగులు విక్రయిస్తున్నారు. బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో రద్దీ బాగా పెరిగింది. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మూడురోజుల ముందు నుంచి పాఠశాలలకు సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇండ్లకు చేరుకున్నారు. గ్రామంలోని మిత్రులతో కలిసి సందడి చేస్తున్నారు.

ఏటా సొంతూరికి వస్తా



ఉద్యోగరీత్యా మేము హైదరాబాద్‌లో ఉంటాం. ప్రతీ ఏడాది పండుగను అమ్మగారి ఊరైన ఆసిఫాబాద్‌లో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సొంత ఊళ్లో అక్కా, చెల్లె, స్నేహితులు, బంధువుల మధ్య పండుగ జరుపుకోవడం తృప్తినిస్తుంది. ముఖ్యంగా అమ్మ చేసిన పిండివంటలు తింటే మాటల్లో చెప్పలేని అనుభూతి కలుగుతుంది.

– దానపల్లి శారద, ఆసిఫాబాద్

సంప్రదాయాలు కాపాడుకుందాం



మేము కరీంనగర్‌లో ఉంటాం. ఎన్ని పనులున్నా పండుగకు మాత్రం సొంతూరైన ఆసిఫాబాద్‌కు పిల్లలతో వస్తాం. పండుగ సమయాల్లో సంప్రదాయ వస్త్రాలే ధరించాలి. భావితరాలకు పండుగ విశిష్టతను తల్లిదండ్రులు తెలుపాలి. చిన్నారులకు బొడబొడ పోకలు పోయాలి. దీంతో పిల్లలు ఆరోగ్యంగా సుఖశాంతులతో ఉంటారని చరిత్ర చెబుతోంది.

– చిట్టిమల్ల నిఖిల, ఆసిఫాబాద్

మాటల్లో చెప్పలేని అనుభూతి



ఉద్యోగరీత్యా మేము లక్సెట్టిపేట మండలం గుడెంలో ఉంటాం. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగను సొంతూరైన ఆసిఫాబాద్‌లోని అమ్మగారి ఇంట్లో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సొంతూళ్లో అక్కా, చెల్లె, స్నేహితులు, బంధువుల మధ్య పండుగను జరుపుకోవడం తృప్తినిస్తుంది. ముఖ్యంగా అమ్మ చేసిన పిండివంటలు భుజించడం మాటల్లో చెప్పలేని అనుభూతినిస్తుంది.

– ముద్దు స్వప్న, ఆసిఫాబాద్

వ్యాపారం పుంజుకొంది



సంక్రాంతి పండుగ సందర్భంగా నేను నడుపుతున్న లేడీస్ ఎంపోరియంలో గిరాకీ పుంజుకొంది. సాధారణ రోజులకంటే మహిళలు ప్రతీరోజు వివిధ వస్తువుల కొనుగోలు కోసం బారులు తీరుతున్నారు. ముఖ్యంగా ముత్తైదువలు నోముకునే వస్తువులు ఎక్కువగా సేల్ అవుతున్నాయి. కరోనా సమయంలో పండుగ గిరాకీ లేకుండే. ప్రస్తుతం ప్రతీరోజు గిరాకీ పెరుగుతోంది.

– తూమోజు ఉమ, లేడీస్ ఎంపోరియం

ఈ దారి.. రాళ్లదారి



రాళ్లు తేలి అధ్వానంగా పరంధోళి రోడ్డు

- 15 ఏళ్ల క్రితమే చేపట్టిన పనులు
- నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకి
- పట్టించుకోని ఇరు ప్రభుత్వాలు
- నరకం అనుభవిస్తున్న గ్రామీణులు
- కొత్త సర్కారుపైనే గంపెడాశలు



నిరుపయోగంగా ఉమ్రి వాగుపై నిర్మించిన వంతెన

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని పలు గ్రామాలు తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే రోడ్డు రాళ్లు తేలి ఉంది. అక్కడక్కడా గుంతలు పడింది. కోతకు గురైంది. దీంతో వాహనాల మాట అటుంచి కాలినడక కూడా కష్టమవుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాల్సిన రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మిన్నకుండి పోతున్నాయి. ఫలితంగా 15 గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. 2008లో కెరమెరి మండలంలోని ఉమ్రి గ్రామం నుంచి పరంధోళి గ్రామానికి బీటీ రోడ్డు వేస్తున్న క్రమంలో అటవీ అనుమతులు లేవనే సాకుతో పనులు నిలిపివేసిన అటవీ అధికారులు ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. నాలుగు కిలోమీటర్ల రోడ్డు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని అటవీ అధికారులు పనులు నిలిపివేశారు. దీంతో రెండేళ్ల క్రితం ఉమ్రి వాగుపై సుమారు రూ.4కోట్లతో నిర్మించిన వంతెన నిరుపయోగమైంది. రోడ్డు నిర్మాణంపై ప్రజాప్రతినిధులెవరూ స్పందించలేదు. దీంతో ప్రస్తుతం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తంజేస్తున్నారు.

15 గ్రామాలకు రవాణా తిప్పలు

ఉమ్రి నుంచి పరంధోళి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం అటవీ అనుమతులు లేక నిలిచిపోగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఏడు గ్రామాల ప్రజలు, మహారాష్ట్రకు చెందిన ఎనిమిది గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక నిత్య నరకం అనుభవిస్తున్నారు. ఇరు రాష్ట్రాల అధీనంలో ఉన్న పరంధోళి, ముకదంగూడ గ్రామపంచాయతీల పరిధిలోగల పరంధోళి, తండా, కోటా, లేండిజాల, ముకదంగూడ, మహరాజ్‌గూడ, శంకర్‌లొద్ది గ్రామాల్లో 1,300 కుటుంబాలుండగా 4,800 జనాభా ఉంది. కాగా, పూర్తిగా మహారాష్ట్రకు చెందిన వణి, లోకేవాడ, తేజ్‌ధరి, మోహదా, జివితి, మెంగుగూడ, ఖాటర్‌గూడ, కొలాంగూడ గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు కెరమెరి మండలంలోని వివిధ గ్రామాలవారితో బంధుత్వం ఉంది. రెండు వైపులా వారు చుట్టరికాలు కొనసాగిస్తుండగా తరచూ కెరమెరికి రావాల్సి వస్తోంది. వారంతా కెరమెరికి రావాలంటే పరంధోళి మీదుగా వయా మాలేపూర్, అనార్‌పల్లి నుంచి రావాల్సి ఉంది.

గర్భిణులకు యమగండమే!

ఇరు రాష్ట్రాల పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా ఆస్పత్రి అవసరాల కోసం వెళ్లాల్సి వస్తే అంతే సంగతి. ప్రధానంగా గర్భిణులు వైద్యం కోసం కెరమెరి పీహెచ్‌సీకి రావాల్సి ఉంటుంది. డిగ్రీ, పీజీ చదివేవారు సుమారు 100మందికి పైగా ఉండగా వీరంతా కళాశాలలకు రాకపోకలు సాగించేందుకు నరకం అనుభవిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలోని గ్రామాల్లో అంతర్గత రోడ్లకు అనుమతులు ఇస్తూ పరంధోళి రోడ్డుకు ఎందుకు ఇవ్వడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఏడు పాఠశాలలుండగా ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. వీరంతా ఆదిలాబాద్ నుంచి బైక్‌పై రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్రి గ్రామం నుంచి అరగంటలో పరంధోళికి చేరాల్సిన ఉపాధ్యాయులకు గంటకుపైగా సమయం పడుతోంది. ఇదే రోడ్డుపై ఆదివాసీల మహిమాన్విత జంగుబాయి ఆలయానికి కూడా వేలాదిమంది భక్తులు ప్రయాణం సాగిస్తున్నారు. గతేడాది ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు ప్రారంభించగా రోడ్డు బాగా లేదన్న కారణంతో ఈ ఏడాది నిలిపివేశారు.

కొత్త ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా?

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి చొరవ చూపలేదు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయా గ్రామాల ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. సీతక్క ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించి పూర్తి చేయించాలని, రహదారి కష్టాలు తీర్చాలని కోరుతన్నారు.

అధికారులు స్పందించాలి



గతంలో రోడ్డు వేస్తున్నప్పుడు అటవీ అధికారులు అనుమతులు లేవన్నరు. ఇది రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని పరంధోళి రోడ్డు నిర్మాణ పనులు నిలిపేశారు. సరైన దారి సౌకర్యం లేక నరకం అనుభవిస్తున్నాం. అధికారులు స్పందించాలి

– పతంగే లింబాదాస్, సర్పంచ్, ముకదంగూడ

వేడుకున్నా ప్రయోజనం లేదు



పరంధోళి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు ఇప్పించాలని గత కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు విన్నవించాం. అయినా ఎలాంటి ఫలితం లేదు. చేస్తాం.. చూస్తాంతోనే వారు సరిపెట్టారు. రోడ్డు లేక చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం.

– కాంబ్డె లక్ష్మణ్, పరంధోళి

అనుమతులు రాలేదు



పరంధోళి రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు రాలేదు. చాలా కాలంగా ఆ రోడ్డు అలాగే ఉంది. రోడ్డు నిర్మాణానికి రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులు ఇవ్వడం మా పరిధిలోని అంశం కాదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది.

– సయ్యద్ మజానొద్దీన్, ఎఫ్ఆర్వో, కెరమెరి

భీం స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించాలి

- పోడుభూములకు పట్టాలివ్వాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- అంబగట్టలో భీం విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్

చింతలమానెపల్లి: జల్, జంగల్, జమీన్ హమారా.. అంటూ తుపాకీ చేతపట్టి పోరాటం చేసిన ఆదివాసీయోధుడు కుమురంభీం స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని అంబగట్టలో కుమురం భీం విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు నివసించే ఏజెన్సీ ప్రాంతాల్లో అదానీ, అంబానీలు అక్రమ మైనింగ్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలకు స్థిరనివాసం లేని పరిస్థితిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరాలుగా సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలివ్వడంలో ప్రభుత్వాలు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కుమురంభీం పోరాడి సాధించిన హక్కులు, చట్టాలను ఆధిపత్య పాలకులు తుంగలో తొక్కి అన్యాయం చేస్తున్నారని, పెస చట్టం, 1/70, జీవో 3 లాంటి హక్కులు ఆదివాసీలకు చెందకుండా పాలకులు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు బీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. పులిని చంపారనే అనుమానంతో పశువుల కాపరులైన ఆదివాసీలను నిర్బంధించి అటవీ అధికారులు చిత్రహింసలకు గురిచేసి జైలుపాలు చేశారని ఆరోపించారు. పసిపిల్లలను కూడా పోలీసులు నిర్బంధించడం విచారకరమని తెలిపారు. ఆదివాసీలకు జరిగే అన్యాయాలపై ఆధిపత్య పాలకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలేదని విమర్శించారు.

జెడ్పీచైర్మన్ల ఎన్నిక నిర్వహించాలి

కుమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎస్టీలను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఎస్టీలకు రిజర్వ్ చేయకుండా జెడ్పీ చైర్మన్ల స్థానాల్లో జనరల్ కేటగిరికి చెందిన జెడ్పీ వైస్‌చైర్మన్లను తాత్కాలిక చైర్మన్లుగా ప్రభుత్వం నియమించడం ఎస్టీ రాజకీయ హక్కులను కాలరాయడమేనని ఆరోపించారు. దీనిపై ఆదివాసీల తరఫున ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, నాయకులు సోయం చిన్నన్న, సిడాం జ్యోతి, జాడి శ్యాంరావు, నీలాగౌడ్, వెంకటేశ్, లహంచు తదితరులున్నారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు
- చిన్నసాకడలో కబడ్డీ పోటీలు ప్రారంభం

కెరమెరి(ఆసిఫాబాద్): క్రీడలే జీవితం కాదని, చదువుపైనా దృష్టి సారించి ఉన్నత స్థానాలు పొందాలని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్నసాకడ (శ్యాంరావుగూడ)లో పెందోర్ జంగు స్మారకార్థం శ్రీసాయిబాబా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరీక్షల సమయంలో ఆటల్లో మునిగి చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దేవుళ్ల, జాతరల పేరిట టోర్నమెంట్లు నిర్వహించి నెలల తరబడి ఆటలకే పరిమితమైతే చదువులు ఏం కావాలని ప్రశ్నించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ విషయంలో రాయిసెంటర్ సర్‌మోడిలు, పటేళ్లు దేవారీలు ప్రత్యేక చొరవ తీసుకుని యువకులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వాలు గిరిజనుల కోసం ఎన్నో పథకాలు, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నా అనుకున్న చదువులు లేకపోవడంతో ఉద్యోగాలు సాధించలేకపోతున్నామని తెలిపారు. నేడు యువత మొబైల్‌ఫోన్లకు బానిస అవుతున్నారని.. అవసరముంటేనే సెల్‌ఫోన్ వాడాలని సూచించారు. పెందోర్ జంగులు వైద్యులు లేని సమయంలో ఆయుర్వేద వైద్యం చేయించి ఎందరికో సాయమందించారని కొనియాడారు. అంతకుముందు గ్రామస్తులు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు కాళ్లు కడిగి తిలకం దిద్దారు. జంగు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కబడ్డీ పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేశారు. గ్రామస్తులు ఇద్దరు ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల కలాం, సర్పంచ్ సుమిత్రాబాయి, న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, ఎంపీటీసీ సభ్యులు సకారాం, ఇస్తేకార్, గ్రామపెద్దలు దంబిరావు, ఆనంద్‌రావు, జలపతిరావు, లక్ష్మణ్, తుకారాం, సోము, సీతారాం, శ్రీనివాస్ తదితరులున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటిన వినీల్



పతకం సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు



స్వర్ణ పతకం సాధించిన వినీల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి వినీల్ జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్–17 నెట్‌బాల్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడని పేర్కొన్నారు. అండర్–19 విభాగంలో అంజన్న, అభిసాయి కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. సీనియర్ బాలికల విభాగంలో దియా సర్కార్, హర్షిత, వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, పీడీ తిరుపతి అభినందించారు.

క్లుప్తంగా

మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్‌పై ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఓ కౌన్సిలర్ ఫిర్యాదు చేశాడు. వైస్ చైర్మన్ తనను చంపుతానని ఫోన్ చేసి బెదిరించినట్లు 20వ వార్డు కౌన్సిలర్ గోషిక రమేశ్ ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006 నుంచి 2020 వరకు చదివిన విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొనగా పూర్వ ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత హాజీపూర్ ఎంఈవో జాడి పోశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, జీవితంలో స్థిరపడిన వారు తాము చదివిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, సత్తన్న, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ బాణాల రాజమౌళి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారులో శుక్రవారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కూతురు తండ్రికి ఇష్టం లేని పెళ్లి చేసుకుందనే కోపంతో కుమారుడితో కలిసి వియ్యంకుడిని హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు డీఎస్పీ మల్లారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన సంటి ప్రవళిక అదే గ్రామానికి చెందిన దగ్గరి బంధువైన పోలీస్ నవీన్‌ను ప్రేమించి ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ పెళ్లి ఇష్టం లేని ప్రవళిక తండ్రి సంటి భీమన్న తమ ఊర్లో ఉండొద్దని, వేరే చోటికి వెళ్లి బతకమని చాలాసార్లు చెప్పాడు. నవీన్ తండ్రి పోలీస్ బుచ్చన్న(65) వారు ఎక్కడికి వెళ్లరని అనంతపేటలోనే ఉంటారని చెప్పేశాడు. దీంతో భీమన్న పోలీస్ బుచ్చన్న కుటుంబంపై కక్ష్య పెంచుకున్నాడు. అదును కోసం చూస్తున్న సమయంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ బుచ్చన్న నిర్మల్‌కు వెళ్లారన్న విషయం తెలుసుకొని బంగల్‌పేట్ శివారులోని జంగల్ హనుమాన్ దగ్గర మాటు వేశారు. బైక్ పైన బుచ్చన్న, అతడి చిన్నల్లుడు పడాల వెంకటేష్ రావడంతో వారిపై భీమన్న, ప్రమోద్ దాడి చేశారు. బుచ్చన్న తలపై తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ సైతం చనిపోయాడని నిందితులిద్దరూ అక్కడి నుండి పరారయ్యారు. పోలీసులు సీసీ కెమెరాలు, సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేయగా భీమన్న, ప్రమోద్ నిందితులుగా తేల్చారు. శనివారం మండలంలోని కొండాపూర్ హైవేపై నిందితులను అరెస్టు చేశారు.

వనక్షేత్రంలో అమ్మవారు..



పూజలు చేసే రావుడ్ దేవత



పోచమ్మ ఆలయం

ఆదివాసీల కొంగుబంగారం, ఆరాధ్యదైవం..అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు ఏర్పాట్లు భారీగా చేయడంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు రవాణా సౌకర్యం కల్పించారు. మహరాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్ సైతం ఏర్పాటు చేశారు. పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లను అమర్చనున్నారు. ఆలయం వరకు సీసీ రోడ్డును వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు శుభ్రం చేయించనున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం!!

- నేటి నుంచి జంగుబాయి ఉత్సవాలు..
- తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో పుణ్యక్షేత్రం
- ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీల ఆగమనం
- నెలరోజుల పాటు పూజలు జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ నిర్వాహకులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఎత్తైన గుట్టలు.. చుట్టూరా అడవులు.. అభయారణ్యం.. ఏపుగా పెరిగిన చెట్లు.. నడిచేందుకు కూడా భయపడే అభయారణ్యంలో జంగుబాయి వనక్షేత్రం..! లక్షలాది మంది ఆదివాసీలు పూజించే జంగుబాయి దేవతా ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం పుష్యం మాసం నుంచి ప్రారంభమై నెల రోజులు పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలంలోని ముకదంగూడ గ్రామ పంచాయతీకి చెందిన మహరాజ్‌గూడ గ్రామ అడవుల్లో జంగుబాయి దేవత కొలువై ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ బస చేసిందని పురాణాలు చెబుతున్నాయి.

గుహలో బస..

ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి దేవత గుహలో బస చేసింది. పోచమ్మ ఆలయం వెనుక భాగం లోంచి పై భాగంలో జంగుబాయి దేవి ఉంది. అది పూర్తిగా గుహ కావడం వల్ల భక్తులు కూర్చునే నడుస్తారు. చిమ్మని చీకటిలో దీపం వెలుగులో ఆ దేవత కనిపిస్తుంది. పుష్యమాసంలో కనిపించే నెలవంక నుంచి జంగుబాయి జాతర అమావాస్య వరకు కొనసాగుతుంది.

ఎనిమిది గోత్రాల కుటుంబాలు ఒకే వేదికపై...

వివిధ రాష్ట్రాల్లోని జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. వారు కేవలం కాలిబాట, ఎడ్ల బండ్లపై వందలాది కిలోమీటర్లు రవాణా సాగిస్తారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పూజారులుగా వ్యవహరిస్తారు. ఆలయ ప్రాంగణంలోనే నైవేద్యాలు తయారు చేసి సమర్పిస్తారు. ఏడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుతో కొంత అభివృద్ధికి నోచుకుంది.

ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు రాక

నేడు తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్ల రప్పలు, దుమ్ము, ధూళిలో సైతం కొందరు కాలిబాటతో వస్తే మరికొందరు ఎడ్ల బండ్లపై వస్తుంటారు. ఎడ్లబండ్లకు పార్కింగ్ స్థలం, భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

ఇలా చేరవచ్చు!

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలం నుంచి అనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరంధోళి మీదుగా... లేదా పరంధోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుతో వెళ్లవచ్చు. లేదా నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా.. ఆదిలాబాద్ నుంచి లొకారి మీదుగా జంగుబాయి దేవి వద్దకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

సౌకర్యాలు కల్పిస్తాం..



జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం. తాగునీటి కోసం ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్యం కోసం గ్రామ పంచాయతీ సిబ్బందిని నియమించాం. నెల రోజులు ఇక్కడే ఉండి చెత్తాచెదారం లేకుండా చూస్తారు.
– మహేందర్, ఎంపీడీవో, కెరమెరి

7వ తేదీ వరకు సాగుతాయి..



నేటి నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ఫిబ్రవరి 7 వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీరోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్లను అమర్చారు.
– కొడప జాకు, ఆలయ కమిటీ చైర్మన్



ముస్తాబైన అమ్మవారి ప్రాంగణం



అమ్మవారి గుహలోని దీపం



పవిత్ర స్నానాలు చేసే కొలను



జంగుబాయి గుహ

కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న శంకర్‌రావు

- ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికులకు ఏ సమస్య వచ్చిన అండగా నిలుస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఎస్సార్పీ–1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులు తమను ఆదరించి ఆరు ఏరియాల్లో గెలిపించారన్నారు. శ్రీరాంపూర్‌లో ఓడిపోయిన కూడా మంచి ఓట్లు వచ్చాయని, ఏరియాలో సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన సంఘం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు భీం రవి, వెంగళ కుమారస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి, నాయకపు అనుకోడ, మోసం గ్రామాల్లో శనివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్సై హీరామన్, పోలీసు సిబ్బంది శంకర్, ప్రశాంత్, లింగయ్య, రజాక్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు..

మండలంలోని నాయకపుఅనుకోడ గ్రామశివారులో శనివారం పేకాటాడుతున్న ఎనిమిదిపై మందిని పట్టుకుని కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 2100 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు



బహుమతి అందిస్తున్న కమిషనర్ భుజంగరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు శనివారం నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చెస్‌తో మేధాశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు చెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులను అభినందించారు. ఈ టోర్నమెంట్ విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ టోర్నీలో 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన ఐదుగురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యశ్వంత్(బెల్లంపల్లి), మనీరక్షిత్(మంచిర్యాల), దేవాన్ష్(ఆసిఫాబాద్), జోత్స్న(బెల్లంపల్లి), విశ్వస్రుజన్(మందమర్రి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. అర్జున చెస్ అకాడమీ ఫౌండర్ కోట సుధాకర్, జిల్లా అధ్యక్షురాలు స్వరూప, కోచ్ రాజేంద్రప్రసాద్, కుమురంభీమ్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద గోపాలకృష్ణ, టోర్నమెంట్ కన్వీనర్ దిలీప్‌కుమార్, ఆర్గనైజర్ గోపిరెడ్డి, పల్లెం సమ్మయ్య పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు ఇచ్చేందుకు అంగీకారం



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు మొగిళి

రెబ్బెన(ఆసిఫాబాద్): వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ గేమ్స్ అండ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందించాల్సిన క్రీడాదుస్తులు, సామగ్రి అందించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2021–22 సంవత్సరానికి సంబంధించిన క్రీడా సామగ్రితో పాటు క్రీడాదుస్తులు అందకపోవటంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. దానిని గుర్తించిన ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని కార్పొరేట్ లెవల్‌లో డైరెక్టర్లతో మాట్లాడారన్నారు. స్పందించిన యాజమాన్యం అన్ని ఏరియాలకు క్రీడా సామగ్రితో పాటు క్రీడా దుస్తులను అందజేసేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, రాజేష్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ నాయకులు నరేస్, సురేష్ కోరి, సమీ పాల్గొన్నారు.

కొత్త జూనియర్ అసిస్టెంట్లకు విధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి యాజమాన్యం ఎక్స్‌టర్నల్ నియామక ప్రక్రియలో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా నియమించబడిన 146 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ల కోసం పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గత నెలలో ఉద్యోగ నియామక పత్రాలు సైతం అందచేసిందన్నారు. ఉద్యోగాల్లోకి చేరిన రెండో రోజునే సింగరేణి గుర్తింపు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగ నియామకాలను నిలిపివేసి ఎన్నికలు పూర్తయ్యాక విధుల్లోకి తీసుకుంటామని తెలిపిందన్నారు. గుర్తింపు ఎన్నికలు పూర్తయి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకపోవటం అన్యాయమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కొత్త జూనియర్ అసిస్టెంట్లకు విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్లరికల్ సిబ్బందిని రిలీవ్ చేయాలి

యాజమాన్యం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా వివిధ ఏరియాలకు బదిలీ అయిన క్లరికల్ సిబ్బందిని వెంటనే రిలీవ్ చేయాలని మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. క్లరికల్ సిబ్బందికి తమకు నచ్చిన ఏరియాలకు బదిలీ అయినప్పటికీ యాజమాన్యం రిలీవ్ చేయకపోవటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారని అన్నారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఏరియా నాయకులు చంద్రశేఖర్, రవీందర్, వెంకటేష్, సమ్మయ్య, వీరస్వామి, వెంకటేష్, రమేస్, దేవేందర్, వెంకటేష్, ఓరం కిరణ్, స్వామి పాల్గొన్నారు.

సంక్రాంతి పూట.. గంగిరెద్దు బతుకాట



నిర్మల్: పొద్దుపొద్దున్నే.. 'పిపిపిపీ.. పిపిపిపీ..' అంటూ సన్నాయి ఊదుతూ.. 'ఓ తల్లీ.. నీ ఇంటిల్లిపాది సల్లంగుండాలని దీవెనలిచ్చేందుకు నీ వాకిట్లకి బసవన్నచ్చిండు.. ఓ అయ్య.. ఆ ఎములాడ రాజన్నే ఈ బసవన్నను నీ ఇంటికాడకు పంపించిండు..' 'ఓ... దూడూ బసవన్న.. అగో నూడు బంగారుతల్లి నీకోసం చీర దెచ్చింది. నాకోసం అయ్య తొడుక్కున్న అంగి తీసుకచ్చింది. ఈ ఇంటి పిల్లా తల్లీ.. ఇంటిల్లిపాది సల్లంగుండాలని మనసారా దీవించు..' అంటూ పాటరూపంలో తను పాడుతూ ఉంటే.. ఆ బసవన్న తలఊపుతూ దీవిస్తున్నాడు. సంకురాత్రి సంబురాల్లో గంగిరెద్దుదే తొలి సందడి. గతంతో పోలిస్తే గంగిరెద్దుల సంఖ్య తగ్గింది. ఇప్పుడున్న వాళ్లు.. ఇక మేమే ఆఖరేమో అంటున్నారు.

- బసవన్న ఆడితేనే.. బతుకు నడుస్తది
- ఊరూవాడా విడిచిపెట్టి..
- అన్ని ఊర్లూ తనవే అన్నట్లు..
- వాడవాడలా తిరిగే 'డూడూ బసవన్న'
- సంక్రాంతి పండుగలో భాగమైన..
- బసవన్నదే తొలి సందడి

గంగిరెద్దే పెద్దదిక్కు..

గంగిరెద్దంటే.. పరమశివుడి వాహనమైన నందిగా భావిస్తారు. భారీకాయంతో బసవన్నగా పూజలందుకుంటూ తనదైన ఆటతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రధానంగా సంక్రాంతి వేళ గంగిరెద్దుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఇక వాటిని పట్టుకుని ఆడిస్తూ.. వాటినే నమ్ముకుని జీవిస్తున్నవాళ్లను గంగిరెద్దురోళ్లు అని పిలుస్తాం. ఆ బసవడు ఆడితేనే తమ బతుకులు నడుస్తాయని వాళ్లు చెబుతున్నారు. కొన్ని వందల కుటుంబాలకు ఇప్పటికీ ఈ గంగిరెద్దే పెద్దదిక్కుగా ఉంది.

వలస జీవనం..

పైన నల్లని కోటు వేసుకుని, కింద తెల్లని ధోతి కట్టుకుని, నెత్తికి పాత పట్టుచీరను పట్కాగా చుట్టుకుని.. చేతిలో సన్నాయితో బసవన్నను పట్టుకుని దర్జాగా వచ్చే గంగిరెద్దురోళ్ల జీవితం పైకి కనిపించేంత దర్జాగా లేదు. ఎక్కడెక్కడికో వెళ్తూ.. వలస జీవనం చేస్తూ.. వాడవాడలా తిరుగుతూ.. గంగిరెద్దును ఆడిస్తేనే వారికి పూట గడుస్తుంది. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న గంగిరెద్దురోళ్లు వేములవాడ ప్రాంతం నుంచి వలస వచ్చారు. జిల్లా కేంద్రం శివారుతో పాటు పలు మండలాల్లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు.

ఊళ్లను పంచుకుని..

అందరూ ఆస్తులను పంచుకుంటుంటే.. వాళ్లు మాత్రం ఊళ్లను పంచుకుంటారు. ఈ ఊరి నుంచి ఆ ఊరి దాకా.. గంగిరెద్దును ఆడించేందుకు వీళ్లకే హక్కు అన్నట్లుగా ముందే పత్రం రాసుకుంటారు. కొన్ని మండలాలకు కొన్ని కుటుంబాలు మాత్రమే ఆడించే హక్కును కలిగి ఉంటాయి. వాళ్లల్లో వాళ్లు రాసుకున్న ఈ పత్రానికీ 'విలువ' ఎక్కువే. ఎవరైనా.. తమ హద్దులు దాటి ఇంకొక్కరి పరిధిలోకి వెళ్తే రూ.లక్షకు పైగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా రాసుకున్న బాండ్‌పేపర్లు, తమ పెద్దలు రాసిచ్చిన పత్రాలనూ వెంట పెట్టుకుని తిరుగుతుంటారు. ఇంట్లో ఆడవాళ్లు బుట్టల్లో పిన్నులు, కాంటలు, బొట్టుబిల్లలు పెట్టుకుని ఊరూరా తిరిగి అమ్ముకుని వస్తారు. ఇలా.. భార్యాభర్త కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఆ 'కళ' తప్పుతుందేమో..

గంగిరెద్దును ఆడించడం ఓ అరుదైన కళ. ఒక ఎద్దును మచ్చిక చేసుకుని అది తమ మాటకు, పాటకు అనుగుణంగా ఆడటం, చేయడమంటే చాలా క్లిష్టమైన పని. ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన విషయం ఉంది. గంగిరెద్దులకు ఆట నేర్పించడానికి వీళ్లలోనే ప్రత్యేక గురువులు ఉన్నారు. 'ఐదేళ్ల కిందట కదిలె పాపన్న దగ్గర ఈ గంగిరెద్దును ఇచ్చిండ్రు. చిన్న గుడ్డును తెచ్చుకుని సాకిన. ఏడాదిపాటు ఆట నేర్చుకునేందుకు కొండగట్టు దగ్గరున్న ఐలాపూర్ కేశవపట్నం గురువు దగ్గరికి పంపిన. రూ.25వేలు తీసుకుని ఆయనే ఏడాది బసవన్నకు తిండిపెట్టి ఆట నేర్పించాడు. ఇప్పుడు ఈ బసవన్న మా కుటుంబానికి తిండిపెడుతున్నడు..' అని గంగిరెద్దును నిమురుతూ నిర్మల్‌లోని మంజులాపూర్‌లో ఉండే కొమురయ్య చెప్పాడు.

బసవన్నతోనే బతుకు..



నేను చిన్నగున్నప్పటి నుంచి బసవన్నతోనే ఉన్న. 20–25ఏళ్ల నుంచి గంగిరెద్దు ఆటాడిస్తున్న. ఆ బసవన్న ఆడితేనే మా బతుకులు నడుస్తున్నయ్. మా తర్వాత వాళ్లు ఇట్ల ఇబ్బందులు పడొద్దనే పిల్లలను చదివిస్తున్నం. – కొమురయ్య

ఇంకో పని తెల్వదు..



మా తాతముత్తాల నుంచి గంగిరెద్దును ఆడించడమే తెలుసు. మా తండ్రులు నేర్పిన ఈ విద్య తప్ప మాకు ఇంకో పని తెలవ్వదు. బసవన్ననే నమ్ముకుని బతుకుతున్నం. ఊరూరు సంచారం చేసుకుంటూ వచ్చినదాంతోనే బతుకులు వెళ్లదీస్తున్నాం. –మల్లయ్య

ఆదుకోవాలె..




గంగిరెద్దులను ఆడించడమూ ఓ కళనే. తరతరాలుగా వస్తున్న మా బతుకుదెరువుగా మారిన ఈ కళను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాం. –గంట రాములు

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఖానాపూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై మనిరామ్ వివరాల ప్రకారం.. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన సాతం భీమన్న(40) భార్య కవిత ఆరు నెలల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటి వెళ్లి తిరిగి రావడం లేదు. భార్య రావడం లేదని జీవితంపై విరక్తితో శనివారం సాయంత్రం ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

దిందా అటవీ ప్రాంతంలో పులి సంచారం..?



గాలింపు చేపడుతున్న అటవీశాఖ సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని దిందా అటవీ ప్రాంతంలో పులి సంచారం శనివారం కలకలం సృష్టించింది. దిందా గ్రామానికి చెందిన రైతు జాడి మల్లయ్య తన పంట భూమిలో పనులు చేసుకోవడానికి వెళ్లగా పులి కనిపించడంతో గ్రామంలోకి పరుగు తీశాడు. గ్రామ సమీపంలోని వాగు వద్ద పులి కనిపించినట్లు గ్రామస్తులకు తెలుపడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కర్జెల్లి రేంజ్ అధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో సెక్షన్, బీట్ అధికారులు చేరుకుని గ్రామస్తులతో కలిసి సమీపంలోని వాగు, అటవీప్రాంతం, పంట భూములను పరిశీలించారు. మహారాష్ట్ర వైపు వెళ్లి ఉంటుందనే అనుమానంతో గ్రామానికి సమీపంలో ఉన్న ప్రాణహిత నదిలో గాలించారు. పులికి సంబంధించిన ఆనవాళ్లు ఏమి లభించలేదని, అయినప్పటికీ పులి జాడ కోసం శాఖాపరంగా గాలింపు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, పనులు చేసుకునే వారు గుంపులుగా వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు.